సాక్షి బాపట్ల

శనివారం । 16 । నవంబర్ । 2024



రజత శంఖుచక్రాలు అందజేత

రేపల్లె రూరల్: రేపల్లె రైలుపేటలోని పట్టాభి రామస్వామి ఆలయంలో స్వామివారికి శైలజ-వెంకటేశ్వరరావు దంపతులు శుక్రవారం కిలో వెండి శంఖుచక్రాలను అందజేశారు.



గ్రామాల్లో సర్వే

ఫిరంగిపురం: మండలంలో శుక్రవారం కూడా ఎన్‌సీడీసీడీ సర్వే నిర్వహించారు. సిబ్బంది ఇంటింటికి వెళ్లి బీపీ, షుగర్, ఆర్బీసీ, క్యాన్సర్ పరీక్షలు చేసి యాప్‌లో నమోదు చేశారు.

పూజితకు బంగారు పతకం



వినుకొండ(నూజెండ్ల): మండలంలోని కుమ్మరపాలెం గ్రామానికి చెందిన అంగటి పూజిత నున్న గ్రామంలో జరిగిన బాలికల కుస్తీ పోటీల్లో బంగారు పతకం సాధించింది. నాగార్జునసాగర్‌లో 8వ తరగతి చదువుతోంది. జాతీయ పోటీల్లో పాల్గొననున్నది.

న్యూస్‌రీల్

వాడరేవులో వైభవంగా సాగర హారతి



చీరాల: మండలంలోని వాడరేవు సముద్ర తీరం ఒడ్డున హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సాగర హారతిని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా హిందూ చైతన్య వేదిక ప్రతినిధులు డాక్టర్ తాడివలస దేవరాజ్, బందారు జ్వాల మాట్లాడుతూ కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని హైందవ శంఖారావం కార్యక్రమంలో భాగంగా మొట్టమొదటిసారిగా సాగర హారతి నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు కారంచేటి నగేష్‌కుమార్, తడవర్తి చంద్ర, పిక్కి నారాయణ, మహేంద్రనాథ్, కోటి వెంకటేష్, గోపి, రఘు, శ్రీ మహాలక్ష్మి మహిళా భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



కారంచేడు: ప్రతి గ్రామాన్ని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులు, సిబ్బంది సంయుక్త సహకారంతో అభివృద్ధి చేయాలని ఏపీ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ జాయింట్ డైరెక్టర్ రామనాథం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం కారంచేడు మండల పరిషత్ సమావేశ హాలులో నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ తరగతిలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)లను ఆయన అడిగి తెలసుకున్నారు. గ్రామాల్లో ప్రధానంగా గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు కీలకపాత్ర పోషించాలని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకొని ఆయా గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ఆయన సూచించారు. పాలకులు, అధికారులు, సిబ్బంది అనుమానాల్ని ఆయన నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కే నేతాజీ, పంచాయతీరాజ్ ఏఈ సీహెచ్ రామచంద్రుడు, ఏపీఎం మోహనరావు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయుడికి లక్ష తమలపాకుల పూజ



అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రజన్నాంజనేయ స్వామికి పౌర్ణమి సందర్భంగా శుక్రవారం లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం ఉభయదాతలు, దేవస్థాన సిబ్బంది, అర్చకులు దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

40,639 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 36,928 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 40,639 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,600 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 17,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 17,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 23,602 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.



సూర్యలంక తీరంలో సామూహిక గౌరీదేవి వ్రతాలు



దంపతుల సామూహిక వ్రతాలు



సైకత శివలింగానికి ప్రత్యేక పూజలు

హరోం హర



సూర్యలంక సముద్రతీరంలో జన సందోహం

- పుణ్య స్నానాలు చేసిన భక్తులు
- కార్తిక దీపాలు వెలిగించి పూజలు
- తీరంలో పహారా కాసిన పోలీసులు, గజ ఈతగాళ్లు
- భక్తులతో కిక్కిరిసిన తారకేశ్వరస్వామి దేవాలయం

పర్యాటకులతో పోటెత్తిన సూర్యలంక తీరం

బాపట్ల టౌన్: శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తిక పౌర్ణమి నాడు సముద్ర స్నానానికి భక్తులు పోటెత్తడంతో సూర్యలంక తీరంలో సందడి నెలకొంది. భక్తుల తాకిడితో తీరమంతా ఆత్యాత్మిక శోభ సంతరించుకుంది. శివ నామస్మరణతో మారుమోగింది రాష్ట్ర నలుమూలల నుంచి పలువురు స్నానమాచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీరంలోనే కార్తిక దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. కార్తిక పౌర్ణమి రోజున సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించి గంగమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తే ఆ ఏడాదంతా ఆమె ఆశీస్సులు మెండుగా ఉంటాయనేది భక్తుల నమ్మకం.

తగ్గిన భక్తులు

వాయుగుండం కారణంగా శుక్రవారం ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తుండటంతో ఈ ఏడాది తీరానికి పర్యాటకులు ఆశించిన మేర రాలేదు. గతంతో పోలిస్తే సంఖ్య గణనీయంగా తగ్గింది. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానాయుడుతో కలసి గంగమ్మ తల్లికి హారతి ఇచ్చి స్నానాలను ప్రారంభించారు.

గౌరీదేవికి పూజలు

స్నానాలనంతరం తీరం వెంబడి మహిళలు ముత్యాల ముగ్గులేసి మధ్యలో గొబ్బెమ్మలు పెట్టారు. దీపారాధనలతో పాటు తీరంలోని ఇసుకతో తయారుచేసిన గౌరీదేవి ప్రతిమలకు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పూజలనంతరం గౌరీదేవి ప్రతిమలతో పాటు గంగమ్మకు ఇష్టమైన పూలు, పండ్లు, తమలపాకులను సముద్రంలో కలిపి పుణ్యస్నానాలాచరించారు.

పటిష్ట బందోబస్తు

భక్తులకు అసౌకర్యాలు కలగకుండా జిల్లా కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడీ ప్రత్యేక ఏర్పాటు చేశారు. డీఎస్పీ, ఇద్దరు సీఐలు , 10 మంది ఎస్‌ఐలతో పాటు తీరాన్ని బట్టి సిబ్బందిని నియమించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలతో పోలీస్ కమాండ్ కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షణ చేశారు. భక్తులు స్నానం ఆచరించే సమయంలో సముద్రంలోకి వెళ్లకుండా 50 మీటర్లకు ఎర్ర జెండాలు పాతించారు. సముద్రంలోనే 12 మరబోట్లు ఏర్పాటు చేసి గస్తీ నిర్వహించారు. 50 మంది గజ ఈతగాళ్లు, అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్, సిబ్బందిని అప్రమత్తంగా ఉంచారు. సముద్ర స్నానాల అనంతరం స్వచ్ఛమైన నీటితో స్నానాలు ఆచరించేందుకు జల్లు పాయింట్లను ఏర్పాటు చేశారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు

తీరంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు అందుబాటులో ఉంచారు.ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. మహిళలకు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గుడారాలు, మరుగుదొడ్లు ఏర్పాటుచేశారు.

కేరింతలు కొట్టిన యువత

వాతావరణం అనుకూలించక భక్తులు రద్దీ తగ్గినప్పటికీ తీరానికి యువకులు అధికసంఖ్యలో చేరుకున్నారు. గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, యువకులు అధిక సంఖ్యలో చేరుకొని ఆహ్లాదకరమైన తీరంలో కేరింతలు కొట్టారు. ఎగిసిపడుతున్న ఆలలకు మునుగుతూ...తేలుతూ వారి చేసిన అల్లర్లతో తీరంలో సందడి నెలకొంది. ఆటపాటలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు గడిపారు.

భక్తులతో కిక్కిరిసిన తారకేశ్వరస్వామి దేవాలయం

సూర్యలంక తీరంలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం తీరం వెంబడి ఉన్న శ్రీ తారకేశ్వరస్వామి దేవాలయంలో మహిళలు జ్యోతులు వెలిగించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులంతా ఒక్కసారిగా దేవాలయానికి చేరుకోవడంతో ప్రాంగణం భక్తులతో కిక్కిరిపోయింది. అయ్యప్ప, భవాని, శివ మాల ధారులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీరంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో కూడా పూజలు చేశారు.



ఆలయంలో కార్తిక దీపాలు వెలగిస్తున్న మహిళలు

తరలి వచ్చిన భక్తులు



నిజాంపట్నం: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులతో సముద్రతీరం పోటెత్తింది.శుక్రవారం వేకువ జామునుంచే అధిక సంఖ్యలో నిజాంపట్నం, దిండి సముద్ర తీరాలకు పుణ్యస్నానాలు ఆచరించేందుకు తరలివచ్చారు.దీంతో సందడి వాతావరణం నెలకొంది. పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాలపై అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చిన్నారులు, యువకులు కేరింతలు కొడుతూ స్నానాలు ఆచరించారు.మహిళలు సముద్ర తీరాన దీపారాధనలు చేశారు. పసుపు,కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సముద్రుడికి సాష్టాంగ నమస్కారాలు చేశారు. పళ్లు, తమలపాకులు,కొబ్బరికాయలను సముద్రంలోకి వదిలారు. అయ్యప్ప, భవాని, శివుని మాలధారులు పుణ్యస్నానాలు ఆచరించి సముద్రునికి పూజలు చేశారు.

ఆంజనేయ స్వామికి పూజలు

పరిశావారిపాలెం సముద్ర తీరాన ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో, శివలింగం వద్ద పుణ్యస్నానాలకు వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.



వాడరేవులో తీరం ఒడ్డున పూజలు



నాయినపల్లి శివాలయంలో జ్వాలాముఖి తోరణం

వాడరేవు తీరంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

- భక్తిశ్రద్ధలతో కార్తిక పౌర్ణమి
- ఏర్పాట్లు పరిశీలించిన ఆర్డీవో, డీఎస్పీ

చీరాల టౌన్: పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం వాడరేవు తీరంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. బాపట్ల జిల్లాలోని అద్దంకి, పర్చూరు, పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, నర్సరావుపేట, సత్తెనపల్లి, తదితర నియోజకవర్గాల నుంచి భక్తులు పెద్దఎత్తున వచ్చారు. మహిళలు సముద్రపు ఒడ్డున ఇసుకతో శివలింగాలను తయారు చేసి కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీరం ఒడ్డున ఉన్న ఆంజనేయస్వామితో పాటుగా గ్రామంలోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య దంపతులు స్నానాలు ఆచరించి తీరం ఒడ్డున ప్రత్యేక పూజలు చేశారు. వాడరేవు తదితర తీర ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చీరాల ఆర్డీవో చంద్రశేఖర నాయుడు, చీరాల డీఎస్పీ మెయిన్ పర్యవేక్షణలో సీఐలు శ్రీనివాసరావు, శేషగిరిరావు, రూరల్ ఎస్ఐ అంబటి చంద్రశేఖర్, మెరైన్ ఎస్ఐ, ఏఆర్, సివిల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీస్ అవుట్‌పోస్టుతో పాటుగా గజఈతగాళ్లతో ప్రత్యేక చర్యలు చేపట్టారు. తీరం ఒడ్డున భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు, మంచినీటి వసతి కల్పించారు. ఒడ్డున హై ఓల్టేజీ లైట్లు, ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు.

ఎస్టీల అభ్యున్నతికి కృషి

కలెక్టర్ జె.వెంకట మురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బాపట్ల: ఎస్టీల అభ్యున్నతికి అన్ని విధాలుగా కృషి చేస్తామని కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. బిర్సా ముండా జయంతిలో భాగంగా జన్ జాతీయ గౌరవ దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధులైన బిర్సా ముండా, అల్లూరి సీతారామరాజు, గాము గంట దొర, గామ మల్లు దొర, బోనంగి పండు పడాల్, కుడుముల పెద్ద బయ్యన్న, హనుమంతప్ప, కారం తమ్మన్న దొరల చిత్రపటాలకు కలెక్టర్ పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గిరిజన సంఘాల నాయకులకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఎస్టీ యువత ఉన్నతంగా ఎదగాలంటే స్వాతంత్ర్య సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. బ్రిటీష్ రాక్షస పరిపాలనను వ్యతిరేకించిన తొలి గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా అని పేర్కొన్నారు. ఆయన నాయకత్వ పటిమను యువత అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు. ఆదివాసి దినోత్సవం రోజున నిర్ణయించుకున్న అంశాలను తక్షణమే అమలు చేయడానికి యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేస్తుందని తెలిపారు. జిల్లాలో 75 వేల మంది ఎస్టీ జనాభా ఉండగా, 3712 మందికి ఆధార్ కార్డులు లేనట్లు గుర్తించామన్నారు. గడిచిన రెండు వారాలలో కొంతమందికి ఇచ్చామని, కొన్ని కుటుంబాలు ఉపాధి కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లినట్టు గుర్తించామన్నారు. తిరిగి తమ స్వగ్రామాలకు చేరితే ఆధార్ కార్డు ఇచ్చి ఉపాధి కల్పిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు.

బుర్లవారిపాలెం కాల్వపై బ్రిడ్జి మంజూరు

చీరాల మండలం బేరిపురం బుర్లవారి పాలెం కాల్వపై బ్రిడ్జి నిర్మించాలని గిరిజన సంఘాల నాయకులు కోరడంతో స్పందించిన కలెక్టర్ తక్షణమే మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇంజినీరింగ్ అధికారులను పంపి అంచనాలు వేయడంతో పాటు నిర్మాణం చేపడతామని తెలిపారు. ఎస్టీల సమస్యలు పరిష్కరించాలని వివిధ సంఘాల నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గిరిజన భవన నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతామని చెప్పారు. ఒక అధికారి నాలుగు ఎస్టీ కుటుంబాలను దత్తత తీసుకుని ప్రభుత్వ పథకాలను వారికి వర్తింప చేసేలా అధికారులందరికీ ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ స్వేచ్ఛా వాయువులు అందించాలని ఉద్యమించిన గిరిజన నాయకుడు బిర్సా ముండా అని కొనియాడారు. బొర్సా ముండా పోరాట పటిమను నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని బాపట్ల ఆర్డీఓ పి. గ్లోరియా చెప్పారు. ఎస్టీల సమస్యలు తెలుసుకోవడానికి కలెక్టర్ బాపట్లలో సర్వే నిర్వహిస్తున్నారని, జనన ధ్రువీకరణ పత్రాల ద్వారా ఆధార్ కార్డులిచ్చేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి బి. ప్రకాశరావు, గిరిజన సంఘాల నాయకులు దేవరకొండ రాము, టి. మోహన్ కుమార్ ధర్మ, శ్రీను, శంకర్రావు, వెంకటేశ్వర్లు, ప్రతాప్ కుమార్, గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తగా రెండు ఇసుక రేవుల గుర్తింపు

బాపట్ల: ఉచిత ఇసుక విధానంలో భాగంగా బాపట్ల జిల్లాలో కొత్తగా రెండు ఇసుక రేవులను గుర్తించామని కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. ఉచిత ఇసుక విధానంపై మైన్స్ శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా రాష్ట్ర రాజధాని నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ వెంకట మురళి హాజరయ్యారు. నదులకు ఆనుకుని ఉన్న గ్రామాలలోని ప్రజల అవసరాలకు ఉచితంగా ఇసుక తీసుకువెళ్లడానికి మండలస్థాయి అధికారి అనుమతులు ఇవ్వాలని ముఖేష్ కుమార్ మీనా చెప్పారు. జిల్లాలో కొత్తగా కొల్లూరు మండలంలోని జువ్వలపాలెం, గాజుల్లంక ప్రాంతాలను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. జువ్వలపాలెం వద్ద ర్యాంపు నిర్మాణం జరుగుతోందని, గాజుల్లంక వద్ద నీటి ప్రవాహం ఉన్నందున తవ్వకాలు నేటికీ ప్రారంభం కాలేదని తెలిపారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, మైన్స్ ఏడీ రాజేష్, డీపీఓ ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు పాల్గొన్నారు.

ఇసుక కావాల్సినవారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

వీక్షణ సమావేశం అనంతరం కలెక్టర్ మురళి మాట్లాడారు. ఇసుక కావాల్సిన వారు సంబంధిత గ్రామ సచివాలయంలో ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ పక్కాగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘనకు గురికాకుండా పర్యవేక్షణ పెరగాలని అధికారులకు సూచించారు. డిసెంబర్ 19న మరుగుదొడ్ల దినోత్సవం నేపథ్యంలో ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్డి తప్పనిసరిగా నిర్మించుకునేలా ప్రజలను చైతన్య పరచాలని ఆయన ఆదేశించారు. మరుగుదొడ్లు, పరిశుభ్రతపై ఈనెల 19 నుంచి డిసెంబర్ 19వ తేదీ వరకు నెల రోజులపాటు ప్రజలలో విస్తృతమైన అవగాహన కల్పించాలని చెప్పారు. కొత్త మరుగుదొడ్లు మంజూరు చేయాలని తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకునే వారిని గ్రామ పంచాయతీ స్థాయిలో గుర్తించి బహుమతులు ప్రకటించాలని ఆదేశించారు.

జీజీహెచ్‌లో రూ.10 కోట్లతో భవన నిర్మాణం

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లో రూ. 10 కోట్లతో రెండంతస్తుల భవన నిర్మాణం చేపట్టేందుకు గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థి డాక్టర్ పాదిల ప్రసాద్ ముందుకు వచ్చారు. గతంలో రూ. 5 కోట్లతో డాక్టర్ పాదిల ప్రసాద్ సూపర్‌స్పెషాలిటీ మిలీనియం బ్లాక్ నిర్మాణం చేపట్టిన ప్రసాద్ పెద్ద మనస్సుతో మరోసారి రూ.10 కోట్లతో రెండంతస్తుల భవన నిర్మాణానికి రంగం సిద్ధం చేశారు. ఈమేరకు శుక్రవారం గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణను కలిసి నిర్మాణ పనులకు పూజ చేశారు. డాక్టర్ పాదిల ప్రసాద్ మాట్లాడుతూ జీజీహెచ్‌కు వచ్చే పేద రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా తాము భవన నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించే వైద్య విభాగాలన్నీ ఒకేచోట అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో భవన నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు.

క్లుప్తంగా

రూ.82 లక్షల విలువైన ఎరువుల అమ్మకాలు నిలిపివేత

ప్రత్తిపాడు: ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న ఓ ఫెర్టిలైజర్ దుకాణంపై వ్యవసాయశాఖ అధికారులు కన్నెర్రజేశారు. రూ.82 లక్షల విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు. ప్రత్తిపాడులోని మోహన్ ట్రేడర్స్‌లో ఎమ్మార్పీ కన్నా అధికంగా ఎరువులను విక్రయిస్తున్నారన్న సమాచారం వ్యవసాయశాఖ అధికారులకు అందింది. దీంతో ప్రత్తిపాడు ఏవో కె.అరుణకుమారి సిబ్బందితో కలిసి దుకాణంలో శుక్రవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంతో పాటు ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు సక్రమమైన బిల్లులు ఇవ్వకుండా తెల్లకాగితాలపై దుకాణం స్టాంప్ వేసి ఇస్తున్నట్లు ఏవో గుర్తించారు. ఇదేమని దుకాణ నిర్వాహకుడు ఎస్.శ్రీనివాసరావును ప్రశ్నించారు. అతను చెప్పిన సమాధానంతో సంతృప్తి చెందని ఏవో రూ.82,94,548 విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు. షాప్ లైసెన్స్ సస్పెండ్ చేయాలని కోరుతూ గుంటూరు ఏడీఏకు సిఫారసు చేసినట్లు అరుణకుమారి తెలిపారు. ఇప్పటికే దుకాణ నిర్వాహకుడికి పలు మార్లు ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు ఎరువులు విక్రయించవద్దని, బిల్లులు సక్రమంగా ఇవ్వాలని సూచించినా పట్టించుకోలేదని, అందుకే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎరువుల విక్రయాలను నిలిపివేశామని ఏవో చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉద్యోగి మృతి

తెనాలి రూరల్: రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉద్యోగి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి తెనాలి–విజయవాడ రహదారిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక చెంచుపేటలోని యాని హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో నివసించే యార్లగడ్డ హనుమంతరావు(73) సివిల్ సప్లయిస్‌లో పని చేసి రిటైరయ్యారు. ఇక్కడి అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా నివసిస్తున్నారు. పిల్లలు అమెరికాలో స్థిరపడ్డారు. శుక్రవారం రాత్రి బైక్‌పై కఠెవరం నుంచి తెనాలి వస్తుండగా వీఎస్సార్ కళాశాల సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. కింద పడిన ఆయన తలపైకి లారీ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందారు. లారీ ఆగకుండా వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీర ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్పీ తుషార్ డూడీ


సూర్యలంక తీరంలో పర్యటిస్తున్న ఎస్పీ

బాపట్ల టౌన్: కార్తిక పౌర్ణమిని దృష్టిలో పెట్టుకొని తీరంలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. ఆయన శుక్రవారం సిబ్బందితో కలిసి సూర్యలంక తీరంలో పర్యటించారు. తొలుత పోలీస్ అధికారులు తీసుకున్న భద్రత చర్యలను పరిశీలించారు. వాచ్ టవర్స్ పైనుంచి సిబ్బంది విధులను పరిశీలించారు. వాహనాల పార్కింగ్‌పై పలు సూచనలు చేశారు. ఈ ఎస్పీ మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం జిల్లాలోని సముద్ర తీరాల వద్ద, కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో, దేవాలయాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 400 మంది స్థానిక, మెరైన్ పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. భక్తులు స్నానాలు ఆచరించే ప్రదేశాలలో లైఫ్ జాకెట్లు, రోప్‌లు ధరించిన సివిల్, మెరైన్ పోలీస్ సిబ్బందిని, గజ ఈతగాళ్లను నియమించినట్లు వివరించారు. సముద్రంలో ఎక్కువ లోతులోకి వెళ్లకుండా ఎరుపు రంగు జెండాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎవరైనా వాటిని దాటి లోపలకు వెళుతుంటే అడ్రసింగ్ సిస్టమ్ ద్వారా సిబ్బంది హెచ్చరిస్తూ ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేస్తున్నారని వివరించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డ్రోన్‌ల ద్వారా సముద్ర తీరంలో నిఘా ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ ఏ.రామాంజనేయులు, బాపట్ల రూరల్ సర్కిల్ సీఐ హరికృష్ణ, రూరల్ సీఐ గంగాధరరావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పర్యాటకులకు అల్పాహారం పంపిణీ

బాపట్ల టౌన్: కార్తిక పౌర్ణమిను పురస్కరించుకొని శుక్రవారం తీరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి భక్తులకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఉదయం సూర్యలంక తీరానికి చేరుకున్న రఘుపతి పార్టీ నాయకులతో కలిసి పర్యాటకులకు కార్తిక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో సూర్యలంక తీరాన్ని ఎంతగానో అభివృద్ధి చేశామని తెలిపారు. గతంలో పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొనే వారిని చెప్పారు. ప్రస్తుత పాలకులు తీరంపై దృష్టి సారించి మరింత అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గవిని కృష్ణమూర్తి, రాష్ట్ర మత్స్యకార సంఘం మాజీ డైరెక్టర్ కొక్కిలిగడ్డ చెంచయ్య, పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు వడ్డిముక్కల డేవిడ్, పార్టీ మండల అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.


పర్యాటకులకు అల్పాహారాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

ఆర్‌టీఐ కమిషనర్ పి. శామ్యూల్


ఆర్‌టీఐ కమిషనర్‌ను సన్మానిస్తున్న ఫోరం ఫర్ బెటర్ బాపట్ల నాయకులు

బాపట్ల టౌన్: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆ శాఖ కమిషనర్ పి. శామ్యూల్ తెలిపారు. పట్టణంలోని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో స్త్రీశక్తి భవన్‌లో శుక్రవారం సాయంత్రం సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్‌టీఐ కమిషనర్ మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా ప్రతి ప్రభుత్వ శాఖ నుంచి కావాలసిన సమాచారాన్ని తీసుకోవచ్చని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వ ఉద్యోగుల్లో పారదర్శకత ఏర్పడుతుందని చెప్పారు. ప్రభుత్వాధికారులు లంచాలు ఆశించకుండా త్వరగా ప్రజల పనులు పూర్తి చేస్తారని పేర్కొన్నారు. అనంతరం శ్యామ్యూల్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి. సాయిబాబు, మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు డాక్టర్ శరత్‌చంద్ర, బహుజన కెరటాల సంపాదకులు పల్నాటి శ్రీరాములు, గురజాల శ్రీనివాసరావు, గుదే రాజారావు, కాగితం కోటేశ్వరరావు, జీవీ మాస్టర్, హరిబాబు, ప్రముఖ అడ్వకేట్ జమృద్దీన్ బాషా, రొటేరియన్ సాంబయ్య పాల్గొన్నారు.

20 తర్వాత మెరుపు సమ్మెకు సివిల్ సప్లయిస్ కార్మికులు సిద్ధం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : కూలీ రేట్లు పెంచాలని సివిల్ సప్లయాస్ కార్పొరేషన్ ముఠా కార్మికులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే ఈనెల 20 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సమ్మె నిర్వహించేందుకు ఏఐటీయూసీ సివిల్ సప్లయిస్ కార్మిక వర్గం సిద్ధంగా ఉందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా)వర్కర్స్ యూని యన్ ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు తెలిపారు. స్థానిక శారదాకాలనీలో సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ రాష్ట్రకార్యదర్శి ఒ.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావులకు కార్మికుల సమస్యలను అంజిబాబు వివరించారు. సమ్మెకు మద్దతు కోరారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం కూలి రేట్ల అగ్రిమెంట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పారదర్శకంగా పత్తి కొనుగోళ్లు

సీసీఐ కొనుగోలు కేంద్రంలో కేంద్రమంత్రి పెమ్మసాని తనిఖీలు


కుర్నూతల సీసీఐ కేంద్రంలో రైతులు, అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రత్తిపాడు: సీసీఐ కేంద్రంలో పత్తి కొనుగోళ్ళు పారదర్శకంగా జరగాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. వట్టిచెరుకూరు మండలం కుర్నూతలలోని గాయత్రి జిన్నింగ్ మిల్లులో ఉన్న సీసీఐ కేంద్రంలో శుక్రవారం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడారు. కొనుగోళ్ల సమయంలో తలెత్తుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాయిశ్చరైజ్ టెస్టుల్లో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని రైతులు పెమ్మసానికి వివరించారు. అనంతరం రైతుల సమక్షంలో దగ్గరుండి అధికారులతో మాయిశ్చరైజ్ పరీక్షలు చేయించారు. తేమ శాతంలో మార్పు ఉండడాన్ని గమనించిన పెమ్మసాని అధికారులతో మాట్లాడారు. వాతావరణం అనుకూలంగా లేని సమయంలో రైతులను ఇబ్బంది పెట్టకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఫిర్యాదు బాక్సు, టోల్ ఫ్రీ నంబర్లను అందుబాటులో ఉంచాలని జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజను ఆదేశించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ పత్తి తేమ పరీక్షలలో తేడాలు రావడం వలన రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కల్తీ విత్తనాలు, పురుగుమందులు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెనుమూడిలో షూటింగ్ సందడి


పెనుమూడిలో షూటింగ్ దృశ్యాలు

రేపల్లె రూరల్: వారం రోజులుగా తెనాలి పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్న జగ్జీవన్‌రామ్ బయోపిక్ షూటింగ్ శుక్రవారం రేపల్లె మండలం పెనుమూడిలోని కృష్ణానది రేవు దగ్గర జరిగింది. బయోపిక్‌లో నటుడు నరసింహరాజు, ముంబై నటి కావ్య కీర్తి, ఎర్రబాబు, జర్నలిస్ట్ భాస్కర్ నటిస్తున్నట్లు దర్శకుడు దిలీప్ రాజా తెలిపారు. బీహార్ రాష్ట్రంలోని చాంద్వా గ్రామంలో జరిగిన సంఘటనను చిత్రీకరించినట్లు పేర్కొన్నారు. బయోపిక్‌లో ఆరుగురు ఎమ్మెల్యేలు నటిస్తున్నట్లు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ మురళి, మేకప్ జనార్దన్, ఆర్ట్ డైరెక్టర్ కనపర్తి రత్నాకర్, ప్రొడక్షన్ మేనేజర్ మునిపల్లి శ్రీకాంత్, సహాయ దర్శకుడు నరేష్ స్వామి, హాజీ ప్రధాన సాంకేతికవర్గంగా పని చేస్తుండగా దిలీప్‌రాజా కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం వహిస్తున్నారు. 2025లో విడుదల చేస్తామని ఎగ్జిక్యూటివ్ నిర్మాత ప్రదీప్ దోనేపూడి చెప్పారు.

తెలుగు సినిమాకు ‘సాహసవంతుడు’

సూపర్‌స్టార్ కృష్ణ జీవిత సాఫల్య పురస్కార మహోత్సవంలో వక్తలు


రూపశిల్పి మాధవరావుకు కృష్ణ జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం

తెనాలి: తెలుగు సినీపరిశ్రమలో తనదైన ప్రయోగాలతో తెలుగు సినిమాను ఉన్నతస్థాయికి తీసుకెళ్లిన సాహసవంతుడు సూపర్‌స్టార్ కృష్ణ అని ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా అన్నారు. కళల కాణాచి–తెనాలి, వేద గంగోత్రి ఫౌండేషన్–విజయవాడ, సూపర్‌స్టార్ కృష్ణ కల్చరల్ వింగ్–తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సూపర్‌స్టార్ కృష్ణ జీవిత కాల సాఫల్య పురస్కార మహోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాకేంద్రంలో ఏర్పాటైన సభకు కల్చరల్ వింగ్ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్ అధ్యక్షత వహించారు. హీరో కృష్ణకు చివరివరకు రూపశిల్పిగా వ్యవహరించిన చేబ్రోలు మాధవరావుకు సూపర్‌స్టార్ కృష్ణ జీవితసాఫల్య పురస్కారాన్ని సినీ నిర్మాత నన్నపనేని సుధాకర్ చేతులమీదుగా ప్రదానం చేశారు. సభలో డాక్టర్ సాయిమాధవ్ మాట్లాడుతూ కృష్ణ నటించిన సత్యనారాయణ స్వామి సినిమా, తనకు ఇండస్ట్రీని పరిచయం చేసిందనీ, కృష్ణం వందే జగద్గురుమ్ సినిమా తనను ఇండస్ట్రీకి పరిచయం చేసినట్టు చెప్పుకున్నారు. సూపర్ స్టార్ అయినప్పటికీ కృష్ణ, విమర్శలను సహృదయంతో స్వీకరించేవారని, ఆయనకు తెనాలిలో పౌరసన్మానం చేయాలని భావించినా సాధ్యపడలేదన్నారు. సినీనిర్మాత నన్నపనేని సుధాకర్ మాట్లాడుతూ కృష్ణతో ఇంద్రధనుస్సు సినిమా చేశాననీ, అప్పట్లో రూ.18 లక్షలు ఖర్చయిందని చెప్పారు. సినిమా చిత్రీకరణకు కృష్ణ ఎంతగానో సహకరించారని గుర్తుచేసుకున్నారు. పురస్కారగ్రహీత మాధవరావు మాట్లాడుతూ తొలిసారిగా కొడాలి గోపాలరావు చైర్మన్ నాటకంలో నటించిన కృష్ణకు మేకప్ వేశాననీ, తర్వాత తొలి సినిమా నుండి చివరి సినిమా వరకు ఆయన రూపశిల్పిగా పనిచేయడం తన అదృష్టమన్నారు. వేదగంగోత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వరప్రసాద్, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, సినీదర్శకుడు రాజా వన్నెంరెడ్డి, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, చెరుకుమల్లి సింగారావు మాట్లాడారు. సభానంతరం ‘నటశేఖరుని సినీ పాటల గానామృతం’ మ్యూజికల్ నైట్ నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


వెంకటేశ్వర్లు మృతదేహం

మార్టూరు: జాతీయ రహదారి దాటే ప్రయత్నం చేస్తున్న వృద్ధుడిని లారీ ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఈ ఘటన మార్టూరులో శుక్రవారం జరిగింది. ఏఎస్ఐ మహబూబ్ బాషా వివరాల మేరకు.. స్థానిక కిశోర్ కాలనీకి చెందిన దార్ల పెద్ద వెంకటేశ్వర్లు (73) అంబేడ్కర్ కాలనీ సర్వీసు రోడ్డు పక్కన గల ఐరన్ గ్రిల్ మధ్య నుంచి జాతీయ రహదారి దాటేందుకు ఒంగోలు– గుంటూరు రహదారిపైకి వచ్చాడు. ఈ క్రమంలో అదే మార్గంలో ఒంగోలు వైపు నుంచి విజయవాడకు టమాటా లోడుతో వెళ్తున్న లారీ వెంకటేశ్వర్లును ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు అపస్మారక స్థితికి చేరుకున్న అతడ్ని స్థానికులు మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడు పెద్ద వెంకటేశ్వర్లుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆనందం.. ఆహ్లాదం

గలగలా పారే సెలయేరులాంటి పసిపిల్లల నవ్వులు.. కోయిలమ్మల్లా మధుర కంఠాలతో ఆకట్టుకున్న బాలల గానామృతాలు.. పచ్చని ప్రకృతి ఒడిలో కొండల మధ్యన చెంగుచెంగున గంతులేసే లేడిపిల్లల్లా.. చిన్నారుల ఉరుకులు.. పరుగులు.. పురివిప్పి ఆడే నెమలి పిల్లల్లా అలరించిన బాల నాట్యమయూరాలతో వీవీఐటీ బాలోత్సవ్–2024 శుక్రవారం కోలాహలంగా ప్రారంభమైంది. చిట్టి చేతులు గీసిన అందమైన చిత్రలేఖనాలు అబ్బురపరిచాయి. తేటతెలుగు తియ్యని పద్య గానాలు వీనులవిందు చేశాయి. ఏకపాత్రాభినయాలు, శాస్త్రీయ జానపద నృత్యాలు, రంగురంగుల విచిత్ర వేషధారణలు ఆహూతులను కట్టిపడేశాయి.




బాలోత్సవానికి హాజరైన తల్లిదండ్రులు

- ఉత్సాహంగా ప్రపంచ తెలుగు బాలల పండుగ
- వీవీఐటీ బాలోత్సవ్–2024 అట్టహాసంగా ప్రారంభం
- తొలిరోజు పాల్గొన్న 13వేల మందికిపైగా విద్యార్థులు


చిత్ర లేఖనం పోటీలో చిన్నారులు

పెదకాకాని: తెలుగు జాతి గొప్పతనాన్ని గౌరవాన్ని ప్రపంచ నలుమూలలా చాటి చెప్పడానికి బాలోత్సవ్ దోహదపడుతుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ చెప్పారు. ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీ బాలోత్సవ్–2024 వేడుకలు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రాంగణంలో శుక్రవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ గంట మోగించి ప్రారంభించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ చిన్నారుల్లో సృజనాత్మకతను, నైపుణ్యాలను వెలికితీసే అద్భుత ప్రయత్నం బాలోత్సవ్ అని కొనియాడారు. ఈ బాలోత్సవ్‌లో పాల్గొన్న విద్యార్థులు తమ ప్రతిభతో అంతర్జాతీయ యవనికపై తెలుగు కీర్తిపతాకను ఎగరేయాలని ఆకాంక్షించారు. తెలుగు జాతి సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడాలని సూచించారు. మాతృభాష గౌరవాన్ని నిలపాలని పేర్కొన్నారు. వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ చిన్నారులు ఆనందంగా ఉంటే అందరూ సంతోషంగా ఉంటారన్నారు. మూడు రోజుల పాటు ఉత్సాహంగా సాగే పోటీల్లో ప్రతిభ చాటాలని చెప్పారు.

తొలిరోజు వివిధ అంశాల్లో పోటీలు

తొలిరోజు శుక్రవారం 13 వేల మందికిపైగా చిన్నారులు వివిధ అంశాల్లో పోటీపడ్డారు. 20 అంశాలు, 61 విభాగాల్లో మూడు రోజులపాటు 30 వేదికలపై పండుగ వాతావరణంలో వేడుకలు జరగనున్నాయి. అనంతరం సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ కండె గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేర తీవ్రత తగ్గించేలా చర్యలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఎస్పీ విఠలేశ్వరరావు

కారంచేడు: గ్రామాల్లో నేర తీవ్రత తగ్గించేలా పోలీసు వ్యవస్థ పటిష్టంగా పని చేస్తుందని బాపట్ల ఏఎస్పీ విఠలేశ్వరరావు అన్నారు. శుక్రవారం రాత్రి ఆయన కారంచేడు చినవంతెన సెంటర్‌లో నిర్వహించిన పల్లెనిద్ర కార్యక్రమంలో ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామాల్లో జరిగే నేరాలు వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. బాపట్ల జిల్లాలో ప్రధానంగా ప్రమాదాలపైనే ఎక్కువగా కేసులు నమోదు అవుతున్నాయన్నారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు పోలీసులతో ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన సూచించారు. ప్రమాదాలకు ద్విచక్రవాహనాలను నడిపేవారు హెల్మెట్‌లు లేకుండా నడపడం, అతివేగం ప్రధానంగా ఉందని తెలిపారు. ఆటో వాలాలు అధిక జనాభాను ఎక్కించుకొని మితిమీరిన వేగంతో ప్రయాణించడం, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వంటివి ప్రధానంగా కనిపిస్తున్నాయన్నారు. దేవాలయాల్లో దొంగతనాలు, ఇళ్లల్లో జరిగే దొంగతనాలను అరికట్టేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నాని చెప్పారు. కార్యక్రమంలో ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, కారంచేడు ఎస్ఐ వీ వెంకట్రావు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా యాక్టివిస్ట్ పంచ్ ప్రభాకర్‌పై కేసు

పెదకాకాని: సోషల్ మీడియా యాక్టివిస్ట్ పంచ్ ప్రభాకర్‌పై పెదకాకాని పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పెదకాకాని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పెండ్యాల సురేష్ ఫిర్యాదు మేరకు అమెరికాలో నివాసం ఉంటున్న పంచ్ ప్రభాకర్ అలియాస్ డాక్టర్ ప్రభాకరరెడ్డిపై ఈనెల 10న రాత్రి పోలీసులు కేసు నమోదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.